సాక్షి పల్నాడు

శుక్రవారం । 26 । జూలై । 2024



ఆధార్ కేంద్రం పరిశీలన

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని రవ్వారం సచివాలయ పరిధిలో జరుగుతున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను డీఎల్‌డీవో వెంకటరెడ్డి, ఎంపీడీవో టి.వీరభద్రాచారి పరిశీలించారు.



దుర్గమ్మ సేవలో మంత్రి అనగాని

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ గురువారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 1416 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 356 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

29న నిధి ఆప్‌కే నికత్


గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 29న నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీ చర్చలు జరుగుతాయని తెలిపారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరూ కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. గుంటూరు అరండల్‌పేట 10వ లైనులోని డీసీబీట, ఈఎస్ఐసీ కార్యాలయం, కృష్ణాజిల్లా గుడ్లవల్లేరులోని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్సార్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా కొండపి మండలం కె.ఉప్పలపాడులోని పాపారావు పబ్లిక్ స్కూల్, విజయవాడ గాంధీనగర్‌లోని ఈఎస్ఐసీ శాఖ కార్యాలయం, బాపట్ల జిల్లా రేపల్లెలోని ఎస్ఎన్‌బీటీ మహిళా డిగ్రీ కళాశాల, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శ్రీరాఘవేంద్ర బాలకుటీర్ హైస్కూల్‌లో జరిగే నిధి ఆప్‌కే నికత్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏప్రిల్‌లో నిర్వహించిన డిగ్రీ కోర్సుల 2వ సెమిస్టర్ ఫలితాలను గురువారం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9,792 మంది హాజరు కాగా వారిలో 5,670 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అదనపు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు మాట్లాడుతూ డిగ్రీ పరీక్షల ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూ.ఏసీ.ఇన్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఆగస్టు 8వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1,240 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పర్సనల్ వెరిఫికేషన్ కు ఒక్కో పేపర్‌కు రూ.1260 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న వారు ఆయా కళాశాల ప్రిన్సిపాల్ ద్వారా వర్సిటీ డిగ్రీ పరీక్షల కో–ఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె .రత్నషీలా మణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య సంధ్య కోలే, సిటిఏ ప్రొఫెసర్ సత్యనారాయణ, రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ భవిత, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ఆషాఢసారె



తెనాలి:వాసవి క్లబ్ వనిత ఆంధ్రాప్యారిస్, తెనాలి ఆధ్వర్యంలో గురువారం వాసవి మాతకు భక్తులు ఆషాఢ మాస సారెను సమర్పించారు. పట్టణ బోసురోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సాయంత్రం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో అమ్మవారికి సారెను సమర్పించారు. వాసవీ క్లబ్ వనిత సభ్యులు, పట్టణ ఆర్యవైశ్య మహిళలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గంగిశెట్టి లీలారాణి, గొల్లపూడి అనూరాధ వెల్లడించారు. కోశాధికారి వక్కలగడ్డ విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు తాళ్లూరి గాయత్రి, సంయుక్త కార్యదర్శులు కొత్తమాసు పద్మావతి, గంగిశెట్టి లక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

యార్డులో 44,403 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 40,010 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 44,403 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ. 18,300 వరకు ధర పలికింది.

ఈ-క్రాప్‌పై నీలినీడలు

ఈ-క్రాప్ నమోదుపై ప్రభుత్వం పిల్లిమొగ్గలు



అన్నదాతకు అన్ని విధాలుగా ఉపయోగపడే ఈ–క్రాప్ పథకం అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జిల్లాలో ఖరీఫ్ పనులు చురుగ్గా సాగుతున్నా వ్యవసాయ విధి, విధానాలపై స్పష్టమైన వైఖరిని కూటమి ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. దీనివల్ల ఖరీఫ్‌లో పంటలు సాగుచేసే రైతులకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పటికే రైతుభరోసా పథకం కింద పంట సాయం అందక ఆందోళన చెందుతున్న రైతులకు ప్రభుత్వ తీరు తీవ్ర ఆగ్రహాన్ని, ఆవేదనను కలిగిస్తోంది.

- స్పష్టత ఇవ్వని కూటమి ప్రభుత్వం
- అమలు చేయకపోతే పంటలు సాగుచేసిన రైతులకు తీవ్ర నష్టం
- జిల్లాలో ఆందోళన చెందుతున్న 3.5 లక్షల మంది అన్నదాతలు
- ఈ–క్రాప్ నమోదు కోసం ఎదురుచూపు
- ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం 2.14లక్షల హెక్టార్లు

ఈ-క్రాప్‌లో గత ఖరీఫ్‌లో నమోదైన సాగు విస్తీర్ణం:	1.51 లక్షల హెక్టార్లు
ఈ ఏడాది ఖరీఫ్ సాగు లక్ష్యం:	2.14లక్షల హెక్టార్లు
ఇప్పటివరకు సాగైంది :	50వేల ఎకరాలు

నరసరావుపేట రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతు భరోసా, ఈ–క్రాప్ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలవుతాయో లేదో అని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఆయా పథకాలపై కూటమి ప్రభుత్వం దాగుడు మూతలు ఆడటం రైతన్నలు గమనిస్తున్నారు. జిల్లాలో గత ఖరీఫ్‌లో 1.51లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయగా వంద శాతం ఈ–క్రాప్ నమోదు చేశారు. రబీలో పంటల సాగు నామమాత్రంగా జరిగినా ఈ–క్రాప్ పూర్తిచేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2.14లక్షల హెక్టార్ల పంట సాగు లక్ష్యం కాగా ఇప్పటికే 50వేల ఎకరాల్లో పత్తి, కంది పంటల సాగు చేశారు. రైతులు గింజ విత్తినప్పటి నుంచి కోత, అమ్మకం వరకు అండగా ఉండే ఈ–క్రాప్ విధానాన్ని అమలు చేయకపోతే భవిష్యత్‌లో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. గిట్టుబాటు ధర కల్పించేందుకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అండగా ఉండేందుకు, అర్హులైన రైతులకు అన్ని విధాలుగా మేలు చేసేందుకు ఈ–క్రాప్ విధానం చక్కగా తోడ్పాటు అందించేంది.



ఈ–క్రాప్ నమోదు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

గత ప్రభుత్వంలో అమలైంది ఇలా...

ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి రూపాయి గ్రామ స్థాయిలో రైతులకు అందజేయాలన్న ఆశయంతో 2019 రబీ సీజన్‌లో ప్రతిష్టాత్మకమైన ఈ–క్రాప్ విధానాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం(ఆర్‌బీ అండ్ యూడీసీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్‌బీకేల్లో నమోదు చేయడం ద్వారా పారదర్శకత ఉండేది. రెవెన్యూ వెబ్‌ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు ఈ–క్రాప్ విధానంలో పంట నమోదు చేసేవారు. ఈ–క్రాప్ విధానం అమలులో ఉండటం వల్ల రైతు సాగుచేసే పంటల వివరాలు వ్యవసాయ శాఖలో నమోదయ్యేవి. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ ఆర్‌బీకేల్లో ఏర్పాటుచేసిన కియోస్క్ మిషన్‌లో నిక్షిప్తమయ్యేవి. సమయానికి ఎరువులు, పురుగుమందులు, నాణ్యమైన విత్తనాలు, రాయితీపై లభించే అవకాశం ఉంది. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడం ద్వారా రైతులు సాగు పట్ల ధీమా కలిగి ఉండేవారు. ఈ–క్రాప్ విధానంలో నమోదైన భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరిత గతిన మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి వీలు కలిగేది. రైతులు తమ పంట ఉత్పత్తులను ఎప్పుడైనా తమకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించేది.

అమలు చేయకపోతే అన్నదాతకు కష్టం..

వరిసాగు చేపట్టే రైతులు, కౌలు రైతుల వివరాలు, సర్వే నంబర్ల వివరాలు వ్యవసాయ శాఖ వద్ద సమగ్రంగా ఉండే అవకాశం లేదు. పంట సాగు వివరాలు తెలియకపోవడంతో సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవసరమైన వ్యవసాయ పరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆస్కారం లేకుండా పోతుంది. రాయితీపై విత్తనాలు, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ రాయితీలు పొందే హక్కు కోల్పోయే ప్రమాదముంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలను రైతులు కోల్పోయే అవకాశం ఉంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పెట్టుబడి రాయితీ పొందే అవకాశం కోల్పోతారు.

తీవ్రంగా నష్టపోతాం



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ విధానాన్ని సక్రమంగా అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. గత ఏడాది రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. తుఫాన్ కారణంగా మిరప పంటకు తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయ అధికారులు పరిశీలించారు. దాదాపు రూ.13,500 నష్ట పరిహారం అందించారు. ఈ–క్రాప్ వలన నిజమైన లబ్ధి చేకూరుతుంది. ఈ–క్రాప్ చేయకపోతే పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర పొందే అవకాశం కోల్పోతాం. ప్రభుత్వం ఈ–క్రాప్ విధానాన్ని కొనసాగిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– గాలం గురుస్వాములు, పమిడిమర్రు, నరసరావుపేట మండలం

ఇంకా ఆదేశాలు అందలేదు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఏ విధమైన ఆదేశాలు అందలేదు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్ పనులు ప్రస్తుతం మరింత ఉపందుకున్నాయి. త్వరలోనే ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం ప్రకారం ప్రతి రైతుకు మేలు చేసేలా వ్యవసాయాధికారులు, సిబ్బంది తమవంతు తోడ్పాటు అందిస్తాం.

– ఐ.మురళి, డీఏఓ, పల్నాడు జిల్లా

పేదలకు వైద్యసేవలు పారదర్శకంగా అందాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైద్యసేవలు పారదర్శకంగా సకాలంలో అందేలా వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. గురువారం స్థానిక ఆరోగ్య కేంద్రాన్ని, ఎంపీడీఓ, తహసీల్దారు కార్యాలయాలను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పరిసరాలతోపాటు వసతులు, ల్యాబ్ పరీక్షలు, రోగులకు అందుతున్న వైద్యసేవలు పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత ఏమైనా ఉందా అని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. మందులకు సంబంధించిన సమగ్ర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైద్య పరీక్షల కోసం మంజూరు చేసిన ఆధునిక యంత్ర పరికరాలు భద్రంగా ఉంచటానికి ఫ్రీజ్ సౌకర్యం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సత్వరమే తెప్పించాలని వైద్యాధికారిని ఆదేశించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలను తనిఖీలు చేసి అధికారులు, సిబ్బంది పని తీరును జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పనిచేయని వారికి వేతనాలు మంజూరు చేస్తున్నారని మండలంలోని మతుకుమల్లి గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా వివరించారు. కలెక్టర్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ పి.సరోజిని, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఎం. పద్మావతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్, ఎంపీడీఓ కె.కవితాచౌదరి, డిప్యూటీ తహసీల్దార్ వి.వెంకట నాగరాజు, ఈవోపీఆర్డీ పి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సాకుల తంత్రం

సీఐలతో బంతాట..

- గుంటూరు రేంజ్‌లో ఇటీవల పది మంది సీఐల బదిలీ
- బదిలీలపై టీడీపీ అనుకూల సామాజికవర్గ సీఐల గగ్గోలు
- గత ఐదేళ్లు పోస్టింగ్ లేనివారినే నియమించాలని డిమాండ్
- తలొగ్గిన మంత్రి లోకేష్.. బదిలీలు నిలిపివేయాలంటూ ఆదేశాలు
- పోస్టింగ్ ఆర్డర్లు తీసుకోని జిల్లా ఎస్పీలు
- ప్రతిపక్ష ముద్ర వేసి ఆర్డర్లు నిలిపేసేందుకు కుట్ర



నరసరావుపేట టౌన్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 50 రోజుల్లో ప్రతీకార రాజకీయాలు పడగ విప్పాయి. ఎన్నడూ లేనివిధంగా హత్యలు, లైంగికదాడులతో రాష్ట్రం వణికిపోతోంది. తాను గొప్ప అడ్మినిస్ట్రేటర్ అని చెప్పుకునే సీఎం చంద్రబాబు కనీసం సమర్థులైన అధికారులను నియమించడంలోనూ విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా గుంటూరు రేంజ్‌లో చర్చనీయాంశమైన సీఐల బదిలీల వ్యవహారమే దీనికి నిదర్శనం.

సమర్థులను పక్కనబెట్టి..

పల్నాడు జిల్లాలోని వినుకొండ పట్టణంలో గత వారం వైఎస్సార్ సీపీ కార్యకర్త రషీద్‌ను తెలుగుదేశం నేత నడిరోడ్డుపై కత్తితో పైశాచికంగా హత్య చేశాడు. ఆ తర్వాత కూడా వైఎస్సార్ సీపీ నేతలపై హత్యాయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. సమర్థులైన పోలీసు అధికారులు లేకపోవడం వల్లే దాడులు పెరుగుతున్నాయనే వాదన వినిపిస్తోంది. ఎస్పీ మలికా గార్గ్ బదిలీ కాగానే హత్యోన్మాదం పడగ విప్పిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థాయి ఏదైనా సమర్థమైన పోలీసు అధికారులు ఉంటే శాంతిభద్రతల పరిరక్షణ సవ్యంగా సాగుతుందన్న విషయం అందరికీ తెలిసిందే.

సీఐల బదిలీల నిలుపుదల వెనుక కుట్ర!

గుంటూరు రేంజ్‌లో ఈనెల 16న పది మంది సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో ఐదుగురు పల్నాడు జిల్లాకు చెందిన సీఐలు ఉన్నారు. ఉత్తర్వులు ఇచ్చిన రెండో రోజే ఆ బదిలీలను నిలిపివేశారు. బదిలీ అయిన సీఐలను విధుల్లోకి చేర్చుకోవద్దంటూ ఎస్పీలకు ఐజీ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. బదిలీల నిలుపుదల వెనుకు పెద్ద కుట్రే జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రతిపక్ష ముద్రవేసి

పల్నాడు ప్రాంతంలో బదిలీ ద్వారా పోస్టింగ్ పొందిన సీఐలపై ఆయా ప్రాంత నాయకులతో పాటు కొందరు టీడీపీ అనుకూల సామాజిక వర్గానికి చెందిన అధికారులు ఉన్నతాధికారులకు, అధికార టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. బదిలీలు పొందిన వారిలో ఎక్కువ మంది గత ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన సీఐలు ఉన్నారని, అందుకే వారి పోస్టింగ్‌లు ఆపాలని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. వెంటనే చినబాబు రంగంలోకి దిగి పోస్టింగ్‌లను తక్షణం ఆపేయాలని ఐజీకి సూచించారని, ఫలితంగా పోస్టింగ్ ఆర్డర్లు తీసుకోవద్దని ఎస్పీకి ఐజీ మౌఖిక ఆదేశాలు జారీ చేశారని తెలుస్తోంది.

అనుకూల మీడియాలో వ్యతిరేకంగా ప్రచారం

అధికారపార్టీ అనుకూల సామాజికవర్గానికి చెందిన కొందరు సీఐలు గ్రూపుగా ఏర్పడి పోస్టింగుల వ్యవహారంలో చక్రం తిప్పుతున్నట్టు తెలిసింది. వారికి నచ్చని సీఐలకు పోస్టింగ్ పడితే వెంటనే తమ అనుకూల మీడియా, సామాజిక మాధ్యమాలలో వ్యతిరేకంగా వార్తలు రాయిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తుళ్లూరు సీఐ ఉదంతమే నిదర్శనమని పలువురు చెబుతున్నారు. తుళ్లూరు సీఐగా మాతంగి శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇచ్చిన గంటల వ్యవధిలోనే ఆయనపై వైఎస్సార్ సీపీ అనుకూల ముద్ర వేసి విధుల నుంచి తప్పించారు. తాజాగా పదిమంది సీఐల వ్యవహారంలోనూ తెరవెనుక ఇదే కుట్ర జరిగిందని తెలుస్తోంది.

నిజాయితీపరులపై నిందలు

ప్రభుత్వాలు మారినప్పుడలా కొన్నిచోట్ల తమకు అనుకూలమైన అధికారులను నియమించుకోవడం సర్వసాధారణం. అయితే నిజాయితీగల అధికారుల జోలికి మాత్రం ఏ ప్రభుత్వమూ వెళ్లదు. కానీ ప్రస్తుతం నిజాయితీగల అధికారులపైనా కొందరు నిందలు మోపుతున్నారు. గత ప్రభుత్వంలో పల్నాడు జిల్లాలోని ఓ నియోజకవర్గంలో టీడీపీ గూండాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుండడంతో ఓ సీఐ గాలిలోకి కాల్పులు జరిపారు. అప్పట్లో అలా చేయకపోతే ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగేవి. ఇలాంటి ఘటనలనూ ప్రస్తుత టీడీపీ నాయకులు భూతద్దంలో చూపిస్తూ లోకేష్‌కు లేనిపోనివి చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీఐల బదిలీలు వ్యవహారం సందిగ్ధంలో ఉన్నట్టు చర్చ జరుగుతోంది.

ర్యాగింగ్ ఘటనపై జిల్లా జడ్జి విచారణ

- హాస్టల్ వార్డెన్‌పై చర్యలకు ఆదేశం
- ర్యాగింగ్ ఏటా జరుగుతోందని చెప్పిన బాధిత క్యాడెట్లు

నరసరావుపేటఈస్ట్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎన్‌సీసీ క్యాడెట్ల ర్యాగింగ్ ఘటనపై 13వ అదనపు జిల్లా జడ్జి ఎన్. సత్యశ్రీ ఘటన జరిగిన ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల హాస్టల్‌లో విచారణ నిర్వహించారు. నరసరావుపేటలోని హాస్టల్‌కు మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి టి. ప్రవల్లికతో కలిసి గురువారం సాయంత్రం న్యాయమూర్తి సత్యశ్రీ హాస్టల్‌కు వచ్చారు. ర్యాగింగ్ ఘటన వెలుగులోకి వచ్చిన తరువాత ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్యను కోరారు. ఘటన వెలుగులోకి వచ్చి రెండ్రోజులైందని.. హాస్టల్ వార్డెన్, అసిస్టెంట్ వార్డెన్లకు షోకాజ్ నోటీసులిచ్చారా అని ప్రశ్నించారు. బాధిత విద్యార్థులను పిలిపించి కనీసం మాట్లాడారా, ర్యాగింగ్‌కు పాల్పడ్డ విద్యార్థులపై ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని ఆదేశించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధుల వివరాలు కూడా చెప్పాలని.. ఘటనపై వారు స్పందించిన తీరుపైనా ప్రశ్నించారు. ఇక హాస్టల్ వార్డెన్, ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ఉన్న మేజర్ బీఎస్ఆర్‌కే రాజు సరైన రీతిలో స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేసిన న్యాయమూర్తి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ఆ తర్వాత బాధిత ఎన్‌సీసీ క్యాడెట్లను విచారించిన న్యాయమూర్తి ర్యాగింగ్ విషయాన్ని కళాశాల ప్రిన్సిపల్, ఎన్‌సీసీ ఆఫీసర్, అధ్యాపకులకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ప్రతి ఏడాది ఈ తంతు కొనసాగుతోందని విద్యార్థులు చెప్పడంతో వార్డెన్ రాజుపై మండిపడి నట్లు సమాచారం. ఘటనపై సమగ్ర వివరాలను అందివ్వాలని ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్యను జడ్జి సత్యశ్రీ ఆదేశించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ర్యాగింగ్ ఘటనపై విచారణ జరుపుతున్న జిల్లా జడ్జి సత్యశ్రీ

విద్యాశాఖాధికారుల విచారణ

ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ర్యాగింగ్ ఘటన వీడియో వైరల్ కావటంతో విద్యాశాఖాధికారులు సుమోటోగా విచారణ చేపట్టారు. శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఇంటర్మీడియేట్, డిగ్రీ కలసి ఉన్న కాంపోజిట్ కళాశాల కావటంతో గురువారం ఇంటర్మీడియేట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) జి.కె.జుబేర్, పల్నాడు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలావతిదేవి సంయుక్తంగా కళాశాల, హాస్టల్‌లో విచారణ నిర్వహించారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థులను విచారించారు. తమకు ఇటువంటివి సహజమేనని విద్యార్థులు తెలిపారు. ర్యాగింగ్‌కు గురైన వారిలో 10మందికిపైగా విద్యార్థులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. నివేదికను ఇంటర్మీడియేట్ విద్య కమిషనర్‌కు అందజేయనున్నట్లు ఆర్ఐఓ జుబేర్ తెలిపారు.

సారె సమర్పణకు తరలివచ్చిన భక్తులు



అమ్మవారి ఉత్సవ మూర్తి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గురువారం పలు భక్త బృందాలు సారెను సమర్పించాయి. విజయవాడతో పాటు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్త బృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చాయి. అమ్మవారికి సారెను సమర్పించేందుకు విచ్చేసిన భక్తులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం రాజగోపురం సమీపంలోని లక్ష కుంకుమార్చన వేదిక వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్తులను ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం కనిపించింది.

క్లుప్తంగా

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

నరసరావుపేటటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితురాలికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.8 లక్షల పరిహారం చెల్లించేలాగా మొదటి అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ టి. ప్రవల్లిక గురువారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన కత్తెర సదాశివరావు వద్ద కుంకపు సామ్రాజ్యం 2021 జులై 6వ తేదీన రూ.9 లక్షలు అప్పుగా తీసుకుంది. చెల్లింపులో భాగంగా రూ.8 లక్షల చెక్కు అందజేసింది. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

బాలికపై యువకుడి అసభ్య ప్రవర్తన

తాడికొండ: 13 ఏళ్ల బాలికపై యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన తుళ్లూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొజ్జా ప్రకాశరావు తమ ఇంటి సమీపంలో 8వ తరగతి చదువుతున్న బాలికపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు తుళ్ళూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఆగస్టు 8 వరకు రిమాండ్ విధించినట్లు తుళ్లూరు సీఐ అనూరాధ తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.10 అడుగుల వద్ద ఉంది.కుడి కాలువకు 5,700, ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మ కాయలు కనిష్ట ధర రూ.2500, గరిష్ట ధర రూ.4700, మోడల్ ధర రూ.3200 వరకు పలికింది.

ఆడిట్ పేరుతో పీఎఫ్ తుది చెల్లింపుల్లో జాప్యం తగదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు, హెచ్ఎంలకు ఉద్యోగ విరమణ అనంతరం పీఎఫ్, ఇతర బిల్లుల తుది చెల్లింపులను ఆడిట్ పేరుతో జాప్యం చేయడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖలీద్ తెలిపారు. పీఎఫ్ చెల్లింపుల్లో జాప్యంపై గురువారం జెడ్పీ కార్యాలయంలోని పీఎఫ్ విభాగంలో అధికారులను కలిసిన ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు ఈ విషయమై వారితో మాట్లాడారు. జనవరి నుంచి ఏప్రిల్ మధ్య ఆ తరువాత ఉద్యోగ విరమణ పొందిన టీచర్లు, హెచ్ఎంల తుది చెల్లింపులకు సంబంధించిన ఫైళ్లను క్లియర్ చేయకుండా ఆడిట్ పేరుతో డిప్యూటీ సీఈఓ వద్ద సంతకాలు కాకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారన్నారని ఆరోపించారు. పీఎఫ్ విభాగంలో అధికారులను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.నాగ శివన్నారాయణ, జిల్లా కార్యదర్శి ఎస్. ఎస్. ఎన్ మూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు డి. రాజేంద్రప్రసాద్, గుంటూరు నగర శాఖ అధ్యక్షుడు షేక్ షూకూర్, సీనియర్ నాయకుడు తలసిల రమేష్ ఉన్నారు.

గుండ్లకమ్మకు మొండిచేయి!

- నాగార్జున సాగర్ నుంచి తాగునీరు విడుదల చేసిన అధికారులు
- గుండ్లకమ్మ నదికి మాత్రం నేటికీ విడుదల చేయని వైనం
- తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్న పరివాహక ప్రాంత ప్రజలు
- ఆందోళనలో 28 గ్రామాల ప్రజలు



ఐనవోలు దగ్గర గుండ్లకమ్మ నది

వినుకొండ(నూజెండ్ల): తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి దిగువకు 4 టీఎంసీల నీరు విడుదల చేశారు. అయితే గుండ్లకమ్మ నదికి మాత్రం సాగర్‌జలాలు విడుదల చేయకపోవడంతో నదీ పరివాహక ప్రాంతంపై తాగునీటికి ఆధారపడ్డ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాగర్ నుంచి దిగువకు నీరు విడుదల చేసిన ప్రతిసారీ గుండ్లకమ్మకు సైతం వదులుతుండడంతో నూజెండ్ల మండలం తంగిరాల వద్ద నుంచి అదే మండలం పువ్వాడ గ్రామం వరకు దాదాపు 28 గ్రామాల ప్రజల తాగు, సాగు కష్టాలు తీరేవి. అయితే ప్రస్తుతం నీటి విడుదల లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి.

తాగునీటికి కటకట..

నూజెండ్ల మండలంలోని తంగిరాల, లింగముక్కపల్లి, తెల్లబాడు, ఉప్పలపాడు, జంగాలపల్లి, త్రిపురాపురం, కొండ్రప్రోలు, ములకలూరు, పువ్వాడ గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల ప్రజల తాగునీటి కోసం గుండ్లకమ్మపై ఆధారపడ్డారు. ఆర్ డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో తాగునీటి ప్రాజెక్టులు కూడా గుండ్లకమ్మ నదిపై ఉన్నాయి.

■ పమిడిపాడు బ్రాంచి కెనాల్, మోదేపల్లి, జమ్ములమడక మేజర్లకు కూడా తాగునీటి అవసరాల కోసం 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నూజెండ్ల మండలంలోని రవ్వవరం, రాముడుపాలెం, ముప్పరాజుపాలెం, కొత్తకొత్తపాలెం, గురప్పనాయుడుపాలెం, కంభంపాడు, పమిడిపాడు గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలకు సాగర్‌జాలల ద్వారా తాగునీటి చెరువులను నింపుతున్నారు. అయితే గుండ్లకమ్మ నదికి మాత్రం నీటి విడుదల చేయకపోవడంపై నదీ పరివాహక గ్రామాల ప్రజలు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొనున్నారు.

మరో ఆరు రోజులు మాత్రమే..

నాగార్జున సాగర్ నుంచి విడుదలైన నీరు మరో ఆరు రోజుల పాటు మాత్రమే సరఫరా అవుతాయని ఎన్ఎస్‌పీ అధికారులు చెబుతుండగా గుండ్లకమ్మ నదికి మాత్రం ఇప్పటివరకు సాగర్‌జలాలు విడుదల చేయకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీరు అందుతాయో లేదో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గుండ్లకమ్మ నదికి సాగర్‌జలాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

వెంటనే నీరు విడుదల చేయాలి..



నూజెండ్ల మండలంలో సాగు, తాగునీటి అవసరాల కోసం దాదాపు 28 గ్రామాల ప్రజలు గుండ్లకమ్మపై ఆధారపడి ఉన్నారు. ప్రధానంగా తాగునీరే కాకుండా గుండ్లకమ్మ నదిపై ఐదు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు ఉన్నాయి. ప్రజల అవసరాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే గుండ్లకమ్మ నదికి నీటిని విడుదల చేయాలి.

–నక్కా నాగిరెడ్డి, ఉప్పలపాడు

గుండ్లకమ్మకు నీరు మా పరిధిలో లేదు..

ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ జలాలు విడుదలయ్యాయి. ముఖ్యంగా నాగార్జున కుడి కాలువ నుంచి ఒంగోలు, రామతీర్థం, దర్శి బ్రాంచి కెనాల్‌తో పాటు నూజెండ్ల మండలం పమిడిపాడు బ్రాంచి కెనాల్‌కు కూడా నీటిని విడుదల చేశాం. సత్వరమే తాగునీటి చెరువులను నింపుకోవాలని సూచించాం. అయితే గుండ్లకమ్మ నదికి నీరు విడుదల చేసే అంశం మా పరిధిలో లేదు. మెయిన్ కెనాల్ నుంచి మాత్రమే గుండ్లకమ్మకు ఉన్నతాధికారులు నీరు విడుదల చేయాల్సి ఉంది.

–ప్రేమ్‌కుమార్, ఎన్ఎస్‌పీ డీఈఈ, వినుకొండ

అధైర్య పడవద్దు .. అండగా ఉంటాం

- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి
- చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు ఏసుబాబుకు పలువురు పరామర్శ



ఏసుబాబుతో మాట్లాడుతున్న డాక్టర్ గీతా హాసంతి

సత్తెనపల్లి: అధైర్య పడవద్దు .. అన్ని విధాలా అండగా ఉంటామని టీడీపీ గూండాల దాడిలో గాయాలపాలై చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మట్టుపల్లి ఏసుబాబు(మోజెస్)ను ఉద్దేశించి వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో సరైన వైద్య చికిత్స అందించకపోవడంతో గురువారం క్షతగాత్రుడు ఏసుబాబును పార్టీ నేత కళ్లం విజయభాస్కర్‌రెడ్డి తదితరులు కలిసి పాత బస్టాండ్‌లోని గీతా మల్టీ స్పెషాలిటీ వైద్యశాలలో చేర్పించారు. క్షతగాత్రుడు ఏసుబాబుతో ఆమె మాట్లాడారు. ఏసుబాబుకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఆమెతోపాటు లీగల్‌సెల్ ఇన్‌చార్జి మారూరి లింగారెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు ఉన్నారు. ఏసుబాబుపై బుధవారం రాత్రి టీడీపీ గూండాలు నందిగామ అడ్డరోడ్డు వద్ద దాడి చేసిన విషయం తెలిసిందే. దీనిపై క్షతగాత్రుడు ఏసుబాబు ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చి దాడి చేసినట్లు గురువారం కేసు నమోదు చేశారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఆగస్టు 2 వరకు కొనసాగనున్న ఇంటింటి సర్వే
- సత్తెనపల్లి డీపీఎంఓ నాగేశ్వరరావు నాయక్



కట్టావారిపాలెంలో జరుగుతున్న ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న డీపీఎంఓ నాగేశ్వరరావు

సత్తెనపల్లి: కుష్ఠు వ్యాధి రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారని సత్తెనపల్లి డీపీఎంఓ డి.నాగేశ్వరరావునాయక్ అన్నారు. కుష్ఠు వ్యాధి నివారణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ఇంటింటికి వెళ్లి శరీరంపై అనుమానిత మచ్చలు ఉన్న వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణకు ఈ నెల 18 నుంచి సర్వే చేపడుతున్నారని, దీనిలో భాగంగా గురువారం సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం, కందులవారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న సర్వేని ఆయన పరిశీలించారు. డీపీఎంఓ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నివారణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్సను అందించడంతోపాటు వ్యాధి తీవ్రత తగ్గే వరకు రోగికి చికిత్సపరంగా అన్ని విధాలా సహాయ సహకారాలను అందిస్తారన్నారు. వ్యాధిగ్రస్తులు మానసికంగా దృఢంగా ఉండేలా కౌన్సెలింగ్ ఇచ్చి భవిష్యత్తు వ్యాధి నియంత్రణపై భరోసా కల్పిస్తారన్నారు. సత్తెనపల్లి రూరల్ మండలం పరిధిలో 4 ప్రాథమిక దశలో ఉన్న కొత్త కేసులను గుర్తించడం జరిగిందన్నారు. ఇంటింటి సర్వే ఈనెల 18న ప్రారంభం కాగా ఆగస్టు 2 వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటికే సత్తెనపల్లి పట్టణంలో 6, సత్తెనపల్లి రూరల్ పరిధిలో 3 పాత కుష్ఠు కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం సత్తెనపల్లి రూరల్ పరిధిలో ప్రాథమిక దశలో ఉన్న నాలుగు కేసులను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాలో 26,223 హెక్టార్లలో పత్తి సాగు

- ఆగస్ట్ రెండో వారం వరకు పత్తి సాగుకు అవకాశం
- పత్తిలో పచ్చ దోమ, తామర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి



పత్తి పొలంలో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లాలో మొత్తం పత్తి పంట సాధారణ విస్తీర్ణం 1,07,156 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 26,223 హెక్టార్లలో పత్తి పంట సాగు చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి చెప్పారు. సత్తెనపల్లి పట్టణం పరిధిలో సాగు చేసిన పత్తి పంటను గురువారం ఆయన పరిశీలించారు. మురళి మాట్లాడుతూ పత్తి పంట సాగు చేయదలసిన రైతులు ఆగస్ట్ రెండో వారం వరకు కూడా విత్తు కొనేందుకు ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం పత్తి పైరులో పచ్చ దోమ, తామర పురుగు గుర్తించామని, దీని నివారణకు ఎసిఫేట్ 350 గ్రాములు లేదా ఏసిటామి ప్రిడ్ లేదా థైయోమిథాక్సమ్ 40 గ్రాములు లేదా పిప్రోనిల్ 400 మీలీ 200 లీటర్లు నీటిలో కలిపి 10 రోజులకు మందులను మార్చుతూ పిచికారీ చేయాలన్నారు. పత్తి పంట చుట్టూ జొన్న లేదా మొక్కజొన్న కంచే పంటగా 2–3 వరుసలు నాటినట్‌లైతే రసం పీల్చే పురుగు ఆశించకుండా నివారించవచ్చన్నారు. ఆముదపు మొక్కలు పొలంలో ఎకరాకు 10 మొక్కలు నాటినట్లయితే పొగాకు, లద్దె పురుగు నియంత్రి చ్చుకోవచ్చని తెలిపారు. కంది పంటను పత్తి పంటలో 5–6 వరుసలకు ఒక వరుస నాటినట్లయితే మిత్ర పురుగుల సంతతి పెంచవచ్చునని, పత్తి పంటతో పాటుగా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి వారి కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్.రవికుమార్, సత్తెనపల్లి ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు, సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి ఎస్.శ్రీధర్ రెడ్డి, ఎంపీఈఓ చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

దేశప్రగతికి సైన్స్, టెక్నాలజీ పురోగతే కీలకం



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు

- షార్ డెప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు
- ఆర్‌వీఆర్‌జేసీలో ముగిసిన జాతీయ అంతరిక్ష దిన వేడుకలు

గుంటూరు రూరల్: అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశాన్ని 2047 నాటికి అగ్ర స్థానంలో నిలపడమే తమ ధ్యేయమని, మానవాళికి మెరుగైన జీవన ప్రమాణాన్ని అందించే దిశగా విద్యార్థులు సాంకేతిక విజ్ఞాన పరిశోధనల వైపు దృష్టి సారించాలని శ్రీహరికోట షార్ డెప్యూటీ డైరెక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో భారత ప్రభుత్వం ఇస్రో, శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నేతృత్వంతో నిర్వహిస్తున్న తొలి జాతీయ అంతరిక్ష దిన వేడుకలు గురువారంతో ముగిశాయి. కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్‌ను అనేక ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి వచ్చిన 9,000 మంది విద్యార్థులు సందర్శించారు. ఎస్ఎల్‌వీ 3, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, హెచ్‌ఆర్ఎల్‌వీ రాకెట్ల నమూనాలను ఆసక్తిగా తిలకించి వాటి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ముగింపు కార్యక్రమంలో షార్ డెప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఇస్రో ప్రయోగాలు, సైన్స్, టెక్నాలజీ ఆవశ్యకత తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం జరిగింది. అతిథులను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్ఎస్‌డీ గుంటూరు సబ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టివి రమణారెడ్డి, సి మురళీధరన్, ఎగ్జిబిషన్ కన్వీనర్ డాక్టర్ జి రామ్మోహన్‌బాబు, షార్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు


టీడీపీ సానుభూతిపరుడి దుశ్చర్య



పొక్లెయిన్‌కు అడ్డుగా నిలిచిన గ్రామస్తులు

అద్దంకి: మండలంలోని కలవకూరు గ్రామ చెరువలో టీడీపీ సానుభూతిపరుడి మట్టి తవ్వకాల్ని గ్రామస్తులు గురువారం అడ్డుకున్నారు. గతంలోనూ అడ్డుకుని తవ్వకాల్ని నిలుపుదల చేసినట్లు మాజీ సర్పంచ్ వెంకటేశ్వర‌రెడ్డి చెప్పారు. కలవకూరులో 202 ఎకరాల్లో సాగు నీటి చెరువు ఉంది. దాని కింద 400 ఎకరాల మాగాణి భూమి సాగవుతోంది. అయితే, చెరువులో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలతో నీటి నిల్వలు గోతులకే పరిమితమవుతున్నాయి. చెరువు నుంచి వేసిన మూడు తూములు పనిచేక, సాగు ప్రశ్నార్థకంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సానుభూతిపరుడు చిరంజీవి చెరువులో పలుమార్లు పొక్లెయిన్ పెట్టి టిప్పర్లతో మట్టిని తరలించడం సరికాదని వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. అక్రమ తవ్వకాల్ని తహసీల్దార్‌కు, వీఆర్వోకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. సంబంధిత అధికారులు మట్టి తోలుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

పంచాయతీలకు ఆదాయంతోనే అభివృద్ధి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో రవికుమార్

మేదరమెట్ల: పంచాయతీలకు ఆదాయంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్ పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ ఆదాయాన్ని పెంపొందించుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల, రావినూతల పంచాయతీ కార్యాలయాల్ని గురువారం ఆయన పరిశీలించారు. మేదరమెట్ల గ్రామంలోని చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తల తేడాల్ని ప్రజలకు వివరిస్తూ అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించాలని సూచించారు. రావినూతల సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఈవోలు లక్ష్మీకాంత్, శ్రీనివాసరావు, ఈపీవోఆర్డీ ఓబులేసు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

హైస్కూల్లో టెన్త్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: చేబ్రోలు కొత్తరెడ్డిపాలెం పరిధిలోని హైస్కూల్ విద్యార్థిని గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మౌనిక పాఠశాలకు వెళ్లిన అనంతరం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె అస్వస్థతకు గురవటంతో గమనించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆటోలో స్థానిక పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్య సేవల కోసం గుంటూరు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ వీఆర్వో దుర్మరణం



వీఆర్వో ప్రవీణ్ (ఫైల్)

తాడేపల్లిరూరల్: తాడేపల్లి 12వ సచివాలయ వీఆర్వో ప్రవీణ్ (37) రోడ్డు ప్రమాదంలో గురువారం తెల్లవారుజామున దుర్మరణం పాలయ్యారు. తుళ్లూరు మండలం, మందడం గ్రామానికి చెందిన ప్రవీణ్ బుధవారం రాత్రి 8 గంటల వరకు విధుల్లోనే ఉన్నట్టు సమాచారం. అనంతరం మందడం వెళ్లాల్సిన ప్రవీణ్ గుడివాడ–మచిలీపట్నం రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. మృతదేహం నుజ్జునుజ్జయింది. ఘటనాస్థలంలో దూరంగా లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా స్థానికులు స్నేహితులు, ఉద్యోగులకు ఫోన్ చేసి చెప్పారు. ప్రవీణ్‌కు ఏడాదిన్నర క్రితమే పెళ్లయింది. ఆయన తండ్రి తుళ్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజలకు అర్జీలు రాసిపెడుతుంటాడు. కొడుకుకు ఉద్యోగం రావడంతో తమ కష్టాలు తీరతాయని కుటుంబ సభ్యులు భావించారు. ఇంతలోనే ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఇదిలా ఉంటే బుధవారం రాత్రి విధుల అనంతరం మందడం వెళ్లాల్సిన ప్రవీణ్ గుడివాడ–మచిలీపట్నం రోడ్డులోకి ఎందుకు వెళ్లాడనేది ఎవరూ చెప్పలేకపోతున్నారు. ప్రవీణ్ మృతి పట్ల ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, తాడేపల్లి తహసీల్దార్ విజయ్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, ఇతర సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోస్ట్‌మార్టం అనంతరం ప్రవీణ్ మృతదేహాన్ని స్వగ్రామం తరలించారు.

వ్యవసాయ అధికారుల తనిఖీలు

- రవాణా, పార్సిల్ కార్యాలయాల్లో సోదాలు
- రూ.1.63 లక్షల కలుపు మందులు స్వాధీనం



తనిఖీల్లో పట్టుబడిన కలుపుమందు పరిశీలిస్తున్న నున్నా వెంకటేశ్వర్లు, విజయభారతి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలోని నకిలీ, అనుమతులు లేని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల సరఫరాను నివారించడంలో భాగంగా అధీకృత డీలర్ పరిసరాలతోపాటు, ఆయా ప్రాంతాల్లో ఉన్న అన్ని రవాణా, పార్సిల్ కార్యాలయాల్లో గురువారం విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. గుంటూరు నగరంలోని మస్తాన్‌దర్గా వద్ద గల క్రాంతి ట్రాన్స్‌పోర్టులో ఎలాంటి బిల్లులూ లేకుండా ఒక వ్యక్తి పేరుపై ట్రిసెల్ కలుపు మందు గుంటూరు రాగా, వ్యవసాయ అధికారులు గుర్తించారు. క్రాంతి ట్రాన్స్‌పోర్టులో రూ.1,14,100 విలువైన 140 లీటర్ల కలుపు మందును గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడులోని పార్సిల్ కార్యాలయంలో రూ.48,900 విలువైన 60 లీటర్ల ట్రిసెల్ కలుపు మందు ఎలాంటి బిల్లులు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ. 1.63లక్షల విలువైన 200 లీటర్ల కలుపు మందును వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ట్రిసెల్ కలుపు మందును రాష్ట్ర ప్రభుత్వం 2018లో నిషేధించినట్లు వివరించారు. రాష్ట్రంలో ట్రిసెల్‌పై ఉన్న నిషేధం దృష్ట్యా కొంత మంది వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి రహస్యంగా రైతులకు విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో చట్ట వ్యతిరేకంగా నిషేధిత కలుపు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయించేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో కమిషనరేట్ జేడీఏ ఎం.విజయభారతి, ఏడీఏ మద్దినేటి, అర్బన్ ఏఓలు బి. గౌతమ్‌ప్రసన్న, సునీల్, తదితరులు పాల్గొన్నారు.